క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



తిరుచ్చిపై దర్శనమిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం శ్రీవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చారు.

వరిలో సస్యరక్షణపై అవగాహన



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రెడ్డిరాం

నింద్ర: వరి పంటకు అధికంగా సోకే ఆకు ముడత తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త రెడ్డిరాం అన్నారు. శనివారం ఆయన మండలంలోని నింద్ర, అగరం, కర్బరవేడు గ్రామాల్లో వరి పంట సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిదశలో వేపనూనె ఐదు మిల్లీలీటర్లు, కార్బోహైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు, ఎకరాకు 8 కేజీలు నీటిలో కలిపి వాడాలన్నారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఓ తులసిరాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు వితరణ



భోజన ప్లేట్లు తీసుకుంటున్న విద్యార్థులు

పుత్తూరు: మండల పరిధిలోని బొజ్జనెత్తం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎస్.ఆనంద్ శనివారం భోజన ప్లేట్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు కేశవులు, పాఠశాల కమిటీ చైర్మన్ శాంతి పాల్గొన్నారు.

బీజేపీ నగరి రూరల్ అధ్యక్షుడిగా మురళి



మురళి

పుత్తూరు: బీజేపీ పుత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడిగా ఎస్.మురళిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.బాబు తెలిపారు. శనివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. బాబు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.హరిబాబు, పార్టీ నాయకులు ఎం.సుబ్రమణ్యం, రవి, భక్తవత్సలం, శేఖర్ పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టండి



గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్పీ శంకర్

పాలసముద్రం : మండల పరిధిలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను నాణ్యతగా చేపట్టాలని సామాజిక తనిఖీ డీఆర్పీ శంకర్ తెలిపారు. శనివారం ఆముదాల గ్రామ సచివాలయంలో సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ లిఖిత ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆముదాల పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో గతేడాది 120 పనులకు గాను రూ.37 లక్షల వరకు పనులు చేపట్టారని, వాటిని సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు చెప్పారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి చేసిన పనులకు సక్రమంగా బిల్లులు వస్తున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. తమకు సక్రమంగా బిల్లులు అందుతున్నాయని చెప్పారన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ 100 రోజులు పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- అర్హత ఉంటే ప్రతి ఇంటికీ లక్షల్లో సంక్షేమ పథకాల లబ్ధి
- మంత్రి రోజా



వడమాలపేట : కదిరిమంగళంలో సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని, అలాగే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం వడమాలపేట మండలం పాదిరేడు సచివాలయ పరిధిలోని కదిరి మంగళం పంచాయతీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజాకు ఇంటింటా వద్ద మహిళలు కర్పూర హారతులు ఇచ్చి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుందా? అమ్మఒడి చదువు చెబుతోందా అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నేటి జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజలకు వందశాతం సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న లక్ష్యంతో నేటి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించే చంద్రబాబు నాయుడు, తర్వాత ప్రజలను మోసం చేయడం ఆయన నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం చేశారని ఇదీ వైఎస్సార్ కుటుంబ నైజమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇలా పలు విధాలుగా ప్రజలకు చేయూత ఇస్తున్న నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జగనన్న కోసం సైనికురాలిగా పని చేయడానికి తాను సిద్ధమని, మీరు సిద్ధమా అంటూ ప్రశ్నించారు. అందరూ ముక్తకంఠంతో తాము సిద్ధమేనంటూ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు చైర్మన్ కరుణాకర్‌చౌదరి, గ్రామ సర్పంచ్ మంజుల, మండల పార్టీ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు యాదవేంద్రరెడ్డి, శేఖర్, సురేష్‌రాజు, ఉమాపతి, చైతు, తులసి, రేణుక, కమల, అంజమ్మ, వేణు, మునిబాబు, సుధాకర్‌రెడ్డి, బాల, వెంకటేశు, రమేష్, పుల్లయ్య, బ్రహ్మయ్య, బత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుచేస్తే వేటు తప్పదు



మద్యం దుకాణంలో బాటిళ్లను పరిశీలిస్తున్న డిపో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

పాలసముద్రం : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది చిన్న పొరపాటు చేసినా వేటు తప్పదని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు, డిపో సీఏ లక్ష్మణరావు తెలిపారు. శనివారం బలిజకండ్రిలోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది విద్యావంతులే ఉంటారని, ఏదైనా పొరపాటు చేసి ఒకసారి ఎఫ్ఐఆర్‌లో వారి పేరు నమోదైతే భవిష్యత్ ఉండదనే విషయాన్ని గుర్తు చేశారు. బీరు సీసాలను ప్రతిరోజు సూపర్‌వైజర్లు సరి చూసుకుంటే స్టాకుల్లో ఎలాంటి తేడాలు ఉండవన్నారు. ఎమ్మార్పీ రేట్లకే మద్యం విక్రయించాలని తాము డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఎవరైనా అధిక ధరలకు అమ్మినట్లు తేలితే కేసులు బనాయిస్తున్నట్లు చెప్పారు. బాటిల్ టు బాటిల్ తనిఖీ చేయాల్సిందిగా సంబంధిత వెరిఫికేషన్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలా చేయడం ద్వారా సంబంధిత సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయడానికి ఆస్కారం ఉండదన్నారు. ఆలైన్ యాప్ ద్వారా నిల్వ ఉన్న స్టాకును సిబ్బంది సహాయంతో నిశితంగా పరిశీలించారు. వారి వెంట సిబ్బంది లోకనాథం, అయ్యప్ప పాల్గొన్నారు.

పాడి ఆవు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పాడి ఆవు

కార్వేటినగరం: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోదండరామాపురం సమీపంలో శనివారం చోటు చేసుకుంది.స్థానికుల కథనం మేరకు కోదండరామాపురం గ్రామానికి చెందిన మురగయ్య కుమారుడు ఏలుమలై జీవనాధారం కోసం రూ.70 వేలు విలువ జేసే పాడి ఆవును కొనుగోలు చేసి పాలు అమ్ముకుని జీవనం గడుపుతున్నాడు. అయితే గ్రామానికి సమీపంలో చేతికి అందేవిధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. శనివారం మేతకు వెళ్లిన పాడి ఆవుకు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో అప్పు చేసి కొనుగోలు చేసిన పాడి రైతు కుటుంబం వీధిన పడిందని అక్కడి వారు తెలిపారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి, చేతికి అందేవిధంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, తీగలను ప్రజలకు ప్రాణాపాయం కలగక ముందే సరి చేయాలని కోరారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ప్రతి మహిళా విద్యావేత్తగా రాణించాలి



ర్యాలీగా వెళ్తున్న స్వయం సహాయక సంఘం మహిళలు

గంగాధర నెల్లూరు: ప్రతి మహిళా విద్యావేత్తగా రాణించాలని ఏపీఎం చిరంజీవి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వెలుగు ఆధ్వర్యంలో జెండర్‌కి సంబంధించి మహిళలకు అవగాహన కల్పిస్తూ బస్టాండ్ కూడలి నుంచి స్వయం సహాయక సంఘం మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం చిరంజీవి మాట్లాడుతూ ప్రతి కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గించడం, బాల్య వివాహాలను అరికట్టడం, లింగ వివక్షతను అరికట్టడం, ప్రతి అమ్మాయి విద్యావేత్తగా ఎదగడంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఈశ్వర్, సంఘమిత్ర మణి, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరం వాసి దాత గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వందమందికి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

దేవరాజ్‌మొదలికి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: పుత్తూరు మొదలియార్ మక్కల్ నల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవరాజ్ మొదలియార్ మృతి పార్టీకి తీరని లోటని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం గేట్ పుత్తూరులో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

అత్యంత విశిష్టమైనది మన రాజ్యాంగం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్

కార్వేటినగరం: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైనదని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ముందస్తు జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత విశిష్టత కలిగిన రాజ్యాంగమని తెలిపారు. అనంతరం రాజ్యాంగ శాస్త్ర నిపుణులు ఎస్.కార్తీక్ విద్యార్థులకు రాజ్యాంగం విధులు, బాధ్యతలను వివరించారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి విద్యార్థులకు భారత రాజ్యాంగం మీద క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. అలాగే భారత రాజ్యాంగ పీఠికను చదివించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

పాలసముద్రం : ప్రధాని మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి పథకంలో నడుస్తోందని జిల్లా కోశాధికారి పీసీ హరినాయుడు తెలిపారు. శనివారం మండలంలోని జయలక్ష్మీపురం గొల్లగంగమ్మ గుడి ఆవరణలో జీడీ నెల్లూరు అసెంబ్లీ కన్వీనర్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. చిత్తూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో మోదీ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మరాజు, వెంకటేశులు, గోగినేని లక్ష్మీపతి, మురుగదాస్, శ్రీనివాసన్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నాగశైలజ

గంగాధర నెల్లూరు: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను రెండవ దశలో త్వరితగతిన ఆధునీకరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశైలజ అన్నారు. జీడీ నెల్లూరు మండల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లపై నాడు-నేడు పథకంపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు ద్వారా దాదాపు 29 సెంటర్లలో రెండవ దశలో మరమ్మతులు, పెయింటింగ్, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణం, ఆధునీకరణ పనులను మొదటి ప్రాధాన్యతగా చేయాలన్నారు. ఇందు కోసం అంగన్‌వాడీ మదర్స్ కమిటీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పర్యవేక్షించి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ ఎస్ఎస్ఏ వెంకటరమణారెడ్డి, ఏపీడబ్ల్యూఐడీసీ ఎస్ఈ శివప్రసాద్, ఎస్ఎస్ఏ మధుసూదన్‌రావు, సీడీపీఓ వినితశ్రీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓలు గుణశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు శెట్టి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే దేశ సమగ్రత



మాట్లాడుతున్న న్యాయమూర్తి విష్ణు

నగరి: భారత రాజ్యాంగం, చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ సూచించారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్థానిక న్యాయస్థానం సంయుక్తంగా రాజ్యాంగం, న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రపంచ పటంలో భారత కీర్తి పతాకం వెలుగొందడానికి దేశ అభివృద్ధికి, సమైక్యతకు, సమగ్రతకు భారత రాజ్యాంగమే కారణమన్నారు. ప్రజాస్వామ్యంలో శాసన శాఖ, కార్యనిర్వాహక శాఖ, న్యాయ శాఖ గురించి వివరించారు. సమస్యలపై న్యాయస్థానాలను ఎలా ఆశ్రయించాలో తెలియజేశారు. న్యాయ ప్రక్రియపై విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



సచివాలయంలో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్

గంగాధర నెల్లూరు: సచివాయల సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని పాచిగుంట గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయ సిబ్బంది పని తీరు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో గానీ, అనుమతి లేకుండా సెలవులు పెట్టడం వంటి విషయాల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. రాష్ట్రప్రభుత్వం పతిష్టాత్మకంగా నిర్వహించనున్న ×ఆడుదాం ఆంధ్ర÷ కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని, పంచాయతీలో యువకులకు ఈ కార్యక్రమం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పిచికారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు చంటి పిల్లలతో సమానం



వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంచిపెడుతున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: వృద్ధులు చంటి పిల్లలతో సమానమని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధుల మధ్య ఎంఈఓ విజయకుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వృద్ధులు చంటి పిల్లలతో సమానమని, వారి అవసరాలను కన్నపిల్లలు చూసుకోవాలన్నారు. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపి వారిని ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే వృద్ధాశ్రమం అభివృద్ధికి తనవంతు సహాయం చేస్తానని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాబర్ట్, గిరి, సీఆర్పీ గణేష్, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న జల విహారం



తెప్పపై ఉభయ దేవేరులతో విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంలోని ప్రసిద్ధ శ్రీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగురోజు శనివారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉభయ దేవరులతో స్వామివారి ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో ఏకాంతంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. శనివారం కావడంతో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా పద్మసరస్సు వద్దకు వేంచేపు చేశారు. సరస్సులో జలాలకు సంప్రోక్షణ తదితర పూజలను నిర్వహించి విద్యుత్ దీపాలు, పచ్చటి మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఉత్సవర్లను అధిష్టింప చేశారు. సరస్సులో తెప్పపై ఐదు ప్రదక్షిణలు స్వామి,అమ్మవార్లు జల విహారం చేశారు. స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు తరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం, ఏకాంత సేవ నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు శ్రీదేవి,భూదేవి సమేతంగా..

తెప్పోత్సవాలలో చివరి రోజు ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తెప్పపై జల విహారం చేయనున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పద్మసరస్సు గట్టుపై నేతి దీపాలను వెలిగించాలని, సరస్సు నీటిలో వదలకూడదని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య విజ్ఞప్తి చేశారు.

రాహు–కేతు పూజలకు పోటెత్తిన భక్తులు



రాహుకేతు పూజా మండపాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శని త్రయాదశి కావడతో రాహు–కేతు పూజలకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం చర్యలు తీసుకుంది. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు వేర్వేరుగా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. పాలకమండలి చైర్మన్ రూ.500 రాహుకేతు పూ జా మండపాన్ని తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దళారీలపై నిఘా పెట్టాలని సూచించారు. అదే విధంగా కంచు గడప వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా దర్శనానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యార్థులకు ప్లేస్ మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గిండీస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సివిల్స్, ఏపీపీఎస్సీ గ్రూప్స్, బ్యాంకు జాబ్స్ వంటి పోటీ పరీక్షలను సంబంధించి మెళకువలు తెలియజేశారు. ప్రిపరేషన్‌ను మొదలు పెట్టే విధానం, ప్రశ్నాపత్రాల సరళి వంటి విషయాలపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కిశోరీ, అధ్యాపకులు విద్యార్థినులు, అకాడమీ సిబ్బంది మణి దీప్, మౌనిక, అంజలి పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా శనివారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. నందీశ్వరుడికి, శ్రీవాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి దీపధూప నైవేద్యాలు సమర్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణలు మిన్నంటాయి. ప్రదోష పూజలకు, దేవతమూర్తులకు పుష్పాలంకరణకు ఉభయదాతగా శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్న రెడ్డి వ్యవహరించారు. ఆలయ చైర్మెన్ బాలాజీ రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఎస్ఎం సురేష్, ఎస్.మునివేలు, జి.మంజుల, ఎస్.మంజుల, ఉమాపతి పాల్గొన్నారు.